## క్లుప్తంగా

### వికసించిన బ్రహ్మకమలం



**పీలేరు :** అత్యంత అరుదుగా కన్పించే బ్రహ్మకమలం పీలేరు పట్టణం లోని ఓ ఇంటిలో వికసించింది. పీలేరు పట్టణం తిరుపతి రోడ్డు రెడ్డి అండ్ రెడ్డి కాలనీలో కొమ్మేపల్లె చంద్రశేఖర్‌రెడ్డి ఇంటి ఆవరణలో బ్రహ్మకమలం వికసించింది. బ్రహ్మకమలాన్ని తిలకించడానికి పలువురు ఆసక్తి చూపారు.

### జూదరుల అరెస్ట్

**బి.కొత్తకోట :** పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్‌చేసినట్లు ఆదివారం పోలీసులు తెలిపారు. బి.కొత్తకోట సమీపంలోని బంగారు నాయిని చెరువు వద్ద జూదరులను అరెస్ట్‌చేసి రూ.2,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

### మాజీ ఎంపీపీ గృహ నిర్బంధం



పోలీసుల నిర్బంధంలో ఖలీల్

**బి.కొత్తకోట :** పెద్దతిప్పసముద్రం మండలం మద్దయ్యగారిపల్లెలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రారంభోత్సవానికి వైఎస్సార్ సీపీ నాయకులు వెళ్లకుండా పోలీసులు గృహనిర్బంధం చేశారు. శనివారం అర్ధరాత్రి స్థానిక మాజీ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాగొండ ఖలీల్ ఇంటికి వెళ్లి నిద్రపోతున్న ఆయనను గృహ నిర్బంధం చేశారు. కార్యక్రమానికి వెళ్లకూడదని ఆంక్షలు విధించారు. ఆదివారం మధ్యాహ్నం వరకు పోలీసులు బయటకు రానీయకుండా బందోబస్తు ఉన్నారు.

### రేపు పాలిటెక్నిక్ కాలేజీలో జాబ్‌మేళా

**మదనపల్లె సిటీ:** స్థానిక నిమ్మనపల్లె రోడ్డులోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కాలేజీలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ ఓబులేసు ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ స్కిల్‌డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాలో కెఎల్ గ్రూపు అమేజాన్, అపోలో ఫార్మసీ, రిలయన్స్ రీటైల్ లిమిటెడ్, శ్రీరామ్ ఫార్చున్, ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీలు పాల్గొంటారన్నారు. నిరుద్యోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9553202509, 8897776368ను సంప్రదించాలన్నారు.

### నల్లవీరగంగమ్మ ఆలయంలో చోరీ



ఆలయంలో సీసీ పుటేజిని పరిశీలిస్తున్న ఎస్‌ఐ బాలకృష్ణ

**పీలేరు రూరల్ :** పీలేరు శివారు ప్రాంతం తిరుపతి రోడ్డు మార్గంలోని శనివారం రాత్రి శ్రీ నల్లవీర గంగమ్మ ఆలయంలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. వివరాలిలావున్నాయి. గుర్తు తెలియని దుండగులు ఆలయంలో ఉన్న హుండీని పగులగొట్టి అందులో ఉన్న డబ్బులు తీసుకెళ్లారు. ఆదివారం ఉదయం ఆలయం వద్దకు వెళ్లిన ఆలయ సభ్యులు చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ బాలకృష్ణ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సీసీ కెమెరా పుటేజిని పరిశీలించారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### పీకేఎం-ఉడా వైస్‌చైర్మన్ బాబర్ మాతృశాఖకు బదిలీ

**మదనపల్లె :** పలమనేరు, కుప్పం, మదనపల్లె అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(పీకేఎం-ఉడా) వైస్‌చైర్మన్ బాబర్ మాతృశాఖ ఏపీపీఎస్సీకి బదిలీ అయ్యారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అనిల్‌కుమార్ సింఘాల్ శనివారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్‌చైర్మన్‌లుగా పనిచేస్తున్న పలువురు డిప్యూటీ కలెక్టర్లు, ఇతర శాఖల అధికారులను తిరిగి వారి మాతృశాఖలకు బదిలీచేస్తూ ఆదేశాలిచ్చారు. అందులో భాగంగా పీకేఎం-ఉడా వైస్‌చైర్మన్‌గా పనిచేస్తున్న బాబర్‌ను తిరిగి ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీగా బదిలీ చేశారు. ఇకపై పీకేఎం-ఉడా వైస్‌చైర్మన్‌గా మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు.

### జీవామృతంతో పంటలకు మేలు

**చిన్నమండెం :** జీవామృతం వల్ల పొలంలో సూక్ష్మజీవులు వృద్ధి చెంది పంటలకు మేలు జరుగుతుందని మండల పాయింట్ పర్సన్ సుబ్రమణ్యం ఆచారి అన్నారు. మండల పరిధిలోని కొత్తపల్లిలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో సాగు చేస్తున్న వేరుశనగ పంటను పరిశీలించారు. వేరుశనగలో యాజమాన్య పద్ధతులను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు అందుబాటులో పశువుల పేడ ఉంటుందని, దీంతో ద్రవ జీవామృతం తయారు చేసి పశువుల పేడపై చల్లి బాగా కలియదిప్పాలన్నారు. అలా చేస్తే బ్యాక్టీరియా ఎక్కువ వృద్ధి చెంది మేలు జరుగుతుందన్నారు.

# కంకర వేశారు.. తారు మరిచారు



కంకర వేసి వదిలేసిన పెద్దమండ్యం-తంబళ్లపల్లె రోడ్డు



గుంతలమయమైన పెద్దమండ్యం-చిన్నమండ్యం రోడ్డు

**పెద్దమండ్యం:** పెద్దమండ్యం-తంబళ్లపల్లె రహదారిపై తారురోడ్డు పనుల కోసం అరకొర ఉన్న రోడ్డును తొలగించి కంకరపరిచి అలాగే వదిలేశారు. దీంతో కంకరపై వాహనాల రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఈ మార్గంలో రహదారి పనులను కాంట్రాక్టర్ చేపట్టారు. ఉప్పరపల్లె క్రాస్ రోడ్డు నుండి ముసలికుంట వరకు, కురమరెడ్డిగారిపల్లె నుంచి బండ్రేవు వరకు రోడ్డు పనులు జరిగాయి. ఈ ప్రాంతంలో దెబ్బతిన్న రోడ్డును పూర్తిగా తొలగించి కొత్తగా కంకర వేసి పనులు చేపట్టారు. అయితే కంర పరిచి మూడు నెలలు కావస్తున్నా తారురోడ్డు వేయలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్రవాహనాలలో కంకరపై ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాహనాదారులు వాపోతున్నారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడుతుంటే అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. అలాగే పెద్దమండ్యం నుంచి చిన్నమండ్యంకు వెళ్లే తారురోడ్డు గుంతలమయమైంది. పెద్దమండ్యం నుంచి కలిబండ వరకు రోడ్డుపై ఎక్కడ చూసినా గుంతలు పడిపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రమైన రాయచోటికి ఈ మార్గంలో నిత్యం వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. రోడ్డు గుంతలు పడిపోవడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి పెద్దమండ్యం-తంబళ్లపల్లె రోడ్డు పనులు చేపట్టాలని, పెద్దమండ్యం -చిన్నమండ్యం రోడ్డులో పడిన గుంతలను బాగు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

## యథేచ్ఛగా ఇసుక అక్రమ తరలింపు



బహుదానది నుంచి ఇసుక తరలించడానికి సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లు

**కలికిరి:** ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక పథకానికి అధికార పార్టీ నాయకులే తూట్లు పొడిచి అక్రమంగా ఇసుక తరలించి జేబులు నింపుకుంటున్నారని ఆ పార్టీ నాయకులే అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. మండల పరిధిలోని మేడికుర్తి సమీపం బాహుదానది నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమంగా తరలుతోంది. కలికిరి నుంచి పీలేరుకు తరలిస్తుండటంతో ఇటీవల పీలేరు పోలీసులు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని రికార్డులను పరిశీలించడంతో ఎటువంటి రికార్డులు లేకుండా ఇసుక తరలిస్తుండటంతో జరిమానా విధించి ఇకపై అక్రమంగా ఇసుక తలించకూడదని హెచ్చరించి పంపారు. అయినా ఇసుక అక్రమరవాణా తీరు మారకుండా ఉంది. బాహుదానదిలో ఏర్పాటులో చేసిన చెక్‌డ్యామ్‌ల వద్ద కూడా ఇసుక ఎత్తుతుండటంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు లబోదిబోమంటున్నారు. అక్రమ రవాణాపై సంబంధిత అధికారులు, పోలీసులు స్పందించడంలేదని టీడీపీ అధిష్టానానికి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. గత ప్రభుత్వ ఇసుక అక్రమ రవాణాతోనే ప్రజలు కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పునిచ్చారని, ఇక్కడా ఇలాగే కొనసాగితే ఎలా చేయాలని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఉచిత ఇసుక సామాన్యులకు చేరేలా చూడాలని కోరుతున్నారు.

### వైఎస్సార్ వర్ధంతిని జయప్రదం చేయండి

**పీలేరు :** దివంగత నేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని జయప్రదం చేయాలని పార్టీ మండల కన్వీనర్లు దండు జగన్‌మోహన్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, రమేష్‌రెడ్డి, నీళ్ల భాస్కర్, కమలాకర్‌రెడ్డి, ముక్తియార్ తెలిపారు. సోమవారం నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో నిర్వహించే వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలకు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. ఉదయం 8.30 గంటలకు గుర్రంకొండ మండలం తరిగొండలో, 9.15 నిమిషాలకు వాల్మీకిపురంలో, 10 గంటలకు చింతపర్తిలో, 10.30 గంటలకు కలికిరిలో, 11 గంటలకు పీలేరులో, 11.45 నిమిషాలకు కేవీపల్లె మండలం గర్నిమిట్టలో, మధ్యాహ్నం 12 గంటలకు కలకడలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## మానవతా సేవలు విస్తృతం చేయాలి



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

**మదనపల్లె సిటీ:** మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు మరింత విస్తృతం చేయాలని సంస్థ వ్యవస్థాపకులు ఎస్.రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీవో హోం నందు మానవత సంస్థ మదనపల్లె నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. శాంతిరథం, బాడీఫ్రీజర్, పాఠశాల విద్యార్థులకు నైతిక విలువలపై శిక్షణ, కళాశాల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, భవిష్యత్తు ప్రణాళికలపై అవగాహన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. అందరూ కలిసి మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అధ్యక్షులుగా సి.భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా పి.ప్రసాద్ రెడ్డి, కార్యదర్శి పి.రమణప్ప, సహాయ కార్యదర్శి వి.నారదరెడ్డి, కార్యవర్గసభ్యులుగా హరినాథ్ బాబు, శ్రీనివాసులురెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, బోర్డు డైరెక్టర్లుగా డాక్టర్ రాటకొండ గురుప్రసాద్, బి.నారాయణరెడ్డి, వెంకటేష్, సుధాకర్‌రెడ్డి, ప్రసాదరావులను ఎన్నుకున్నారు.కొత్త కార్యవర్గం ప్రమాణస్వీకారం చేశారు.

### సేవా భావంతో ముందుకు సాగాలి

**కలికిరి:** మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు విస్తరింప చేయడానికి సంస్థ సభ్యులు కృషి చేయాలని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామచంద్రారెడ్డి కోరారు. సంస్థ కలికిరి కార్యాలయంలో ఆదివారం శాఖ చైర్మన్ రత్నశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సరసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ సామాన్యుల సేవే లక్ష్యంగా సంస్థ ఆవిర్భవించడం జరిగిందని, ఆ లక్ష్యంతో సభ్యులు ముందుకెళ్లి సంస్థకు మరింత బలం చేకూరేలా సభ్యత్వాలు నమోదు చేయించాలన్నారు. సేవాభావం కలిగిన ప్రతి ఒక్కరూ సంస్థలో భాగస్వాములయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ కడప జిల్లా చైర్మన్ గోపి, కలికిరి శాఖ సభ్యులు ఉత్తమరెడ్డి, మల్‌రెడ్డి, నాగభూషణరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, యర్రంరెడ్డి, రమేష్‌కుమార్‌రెడ్డి, వెంకటరెడ్డి, న్యామతుల్లా, రమణారెడ్డి, చాముండేశ్వరయ్య, శివారెడ్డి, యల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మిట్స్ విద్యార్థులకు కేంబ్రిడ్జ్ సర్టిఫికేషన్



సర్టిఫికేషన్ అందుకున్న విద్యార్థులు

**కురబలకోట:** మదనపల్లె దగ్గర అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ విద్యార్థులు ఏడుగురు ప్రతిష్టాత్మక కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ నిర్వహించిన లింగ్వా స్కిల్ సర్టిఫికేషన్ అందుకున్నారని ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. ఈ ఫలితాలు భాషా సామర్థ్యాన్ని వివరించే అంతర్జాతీయ ప్రమాణమైన కామన్ యూరోపియన్ ఫ్రేమ్ వర్క్ ఆఫ్ రిఫరెన్స్ (సీఈఎఫ్ఆర్)తో సమలేఖనం చేయబడ్డాయన్నారు. విద్యార్థులు ఉదయశంకర్‌రెడ్డి గంగిరెడ్డి, ముడిశెట్టి శివాని, అడపాల సత్యప్రియ, కార్తీక్ సాయి, జెక్కులేటి కృష్ణ సాయి, తబ్బుల మహేష్, ఓంకార్ గడ్డం ఈ సర్టిఫికేషన్ అందుకున్నట్లు తెలిపారు.

### అమ్మవారికి కిలో వెండి వితరణ

**లక్కిరెడ్డిపల్లి:** అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మతల్లికి లక్కిరెడ్డిపల్లి మండలం, అప్పకొండయ్యగారి పల్లికి చెందిన రామచంద్ర కుటుంబసభ్యులు ఆదివారం కిలో వెండిపల్లెంను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి మారుతీ ప్రసాద్, ఆలయ సిబ్బందికి వెండి హారతి పల్లెం, కుంకుమ భరణి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదిమూలం రామచంద్ర, చెల్లు వంశీయులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణ సేవా సంఘం అభివృద్ధికి సహకారం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

**మదనపల్లె సిటీ:** శ్రీ శంకర బ్రాహ్మణ సేవా సంఘ అభివృద్ధికి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా అన్నారు. ఆదివారం స్థానిక శంకర బ్రాహ్మణ సేవా సంఘాన్ని సందర్శించారు. సంఘం అభివృద్ధికి రూ.లక్ష విరాళంగా ప్రకటించారు. అసంపూర్తిగా ఉన్న వినాయకుని గుడి నిర్మాణం చేపట్టాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు కోదండరామయ్య, గౌరవ అధ్యక్షులు ప్రసాదరావు, ప్రకాష్, నరసింహాచార్యులు, కేశవాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

### దళిత మిత్ర సంఘం ఎన్నిక

**సంబేపల్లె :** దళితుల అభ్యున్నత కోసం దళిత మిత్ర సంఘాలను ఏర్పాటు చేసుకొంటున్నట్లు రాష్ట్ర అధికార ప్రతినిధి నాగభూషణం పేర్కొన్నారు. దళిత మిత్ర వ్యవస్థాపకుడు రామాంజనేయులు ఆదేశాల మేరకు ఆదివారం మండల కేంద్రంలో సంబేపల్లె మండల కమిటీని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా సి. యువరాజు, ఉపాధ్యక్షుడిగా యం, వెంకటరమణ ఎన్నుకున్నారు. అదే విధంగా కలకడ మండల కమిటీలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డెప్ప, ఎంపీటీసీ రామరాజు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

# రెడ్డెమ్మ తల్లీ..కరుణించమ్మా



అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

**గుర్రంకొండ:** మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో సందడి నెలకొంది. రెడ్డెమ్మ తల్లీ ..కరుణించమ్మా అంటూ భక్తులు మొక్కుకొన్నారు. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి వేకువజామునే నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. అమ్మవారి ఆలయానికి ఉదయం నుంచే భక్తుల రాక మొదలైంది. మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించి సంతాన కోసం వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు బంగారు, వెండి, చీరేసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు. భక్తులు ఆలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

### ఇజ్రాయిల్ దాడులపై నిరసన

**రాయచోటి అర్బన్:** పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ దాడులను ఖండిస్తూ ఆదివారం రాయచోటిలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు సి.హెచ్. చంద్రశేఖర్, పి.శ్రీనివాసులు, ఎ.రామాంజులు మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాదుల సహకారంతో పాలస్తీనాపై దురాక్ర మణకు దిగుతున్న ఇజ్రాయిల్ వైఖరిని ప్రతిఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. ఆసుపత్రులు, పాఠశాలలపై ఇజ్రాయిల్ క్షిపణులతో దాడి చేయడం దారుణమన్నారు. ప్రపంచదేశాలు జోక్యం చేసుకుని పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న యత్నాలను అడ్డుకోవాలంటూ కోరారు. కార్య క్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.వి.రమణ, సభ్యులు రాజేశ్వరి, శ్రీలక్ష్మి, సుజాత, ఐద్వా జిల్లా కన్వీనర్ యం.భాగ్యమ్మ, ఖాజాబీ, మాధవయ్య పాల్గొన్నారు.

## రైతాంగ సమస్యలు పరిష్కరించాలి

**రాయచోటి అర్బన్:** రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి పి.యల్. నరసింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుకోర్కెల దినోత్సవం సందర్భంగా బస్టాండు సర్కిల్‌లో రైతుసంఘం జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు సాగుచేసిన పంటలకు మార్కెటింగ్ సౌకర్యం లేక, గిట్టుబాటు ధరలు లభించక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రైతులకు సరైన మార్కెటింగ్ వసతులు, గిట్టుబాటు ధరను కల్పించాలని కోరారు.

### రక్తదానం మహాదానం

**రైల్వేకోడూరు అర్బన్:** అత్యవసర సమయాల్లో ప్రాణాలను తిరిగి తెచ్చే రక్తాన్ని దానంగా ఇవ్వడం మహాదానం అని వాసవిక్లబ్ గవర్నర్ సీహెచ్ వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి పెండ్యాల విజయకుమార్ అన్నారు. ఆదివారం స్థానిక వాసవి కల్యాణ మండపంలో వాసవీక్లబ్ అధ్యక్షుడు తిరునామాల కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన మేగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత రక్తదానంలో ముందుండాలని పిలుపునిచ్చారు.

## కల్వర్టు .. నీరు పట్టింటే ఒట్టు



క్యూరింగ్ లేని కల్వర్టు

**పీలేరు :** స్థానిక ఆర్టీసీ బస్టాండ్ లోనికి వెళ్లే మార్గంలో ఎట్టకేలకు కల్వర్టు కట్టారు.. కానీ క్యూరింగ్ మరిచారు. ఆర్టీసీ బస్టాండ్ లోనికి వెళ్లే మార్గంలో మురుగునీటి కాలువ తీసి వదిలేయడంలో వాహన చోదకులు, ప్రజలు ఇబ్బంది పడేవారు. వివిధ దినపత్రికల్లో వచ్చిన కథనాలకు స్పందించిన పంచాయతీ అధికారులు ఎట్టకేలకు కల్వర్టు నిర్మించారు. పనులు పూర్తి చేసి వారం రోజులు గడుస్తున్నా క్యూరింగ్‌కు నీరు పట్టడం లేదు. దీంతో బస్సులు, వాహనాలు ఈ కల్వర్టుపై వెళితే కల్వర్టు ఎంతకాలం నిలబడుతుందని పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

## వలసపల్లె హౌసింగ్ కాలనీలో వీఆర్వో చేతివాటం

**మదనపల్లె :** మండలంలోని వలసపల్లె న్యూ హౌసింగ్ కాలనీలో వీఆర్వో శ్రీనివాసులు చేతివాటం ప్రదర్శించి, ప్రభుత్వ స్థలాలను అనర్హులకు కట్టబెడుతున్నాడని గ్రామస్తులు తెలిపారు. హౌసింగ్ కాలనీ లేఅవుట్‌లో ప్రజా అవసరాలకు కేటాయించిన స్థలంలో డబ్బులు తీసుకుని ఇతరులు అక్రమంగా కట్టడాలు నిర్మించుకునేందుకు అనుమతులు ఇస్తున్నాడని ఆరోపించారు. రోడ్డుకోసం వదిలిన స్థలాల్లోనూ నిర్మాణాలకు అనుమతులిస్తున్నాడని, ఇదేమిటని అడిగితే బెదిరిస్తున్నాడన్నారు. సుమారు 10 ఇళ్ల వరకు అక్రమంగా నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఈ విషయమై ఇదివరకే తహసీల్దార్, సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా హౌసింగ్‌కు కేటాయించిన ఇళ్లను రెండింటిని కలిపి ఒకే నిర్మాణం చేసేందుకు సహకరిస్తున్నాడన్నారు. వీఆర్వో శ్రీనివాసులుపై గ్రామస్తులు ఎస్.నారాయణ, టి.సురేంద్ర, పి.బాబ్‌జాన్, కే.సుశీల, ఎం.రంగప్ప, పి.బాలమూర్తి, పి.జయప్ప, టి.శ్రీరాములు తదితరులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## బసినికొండలో ప్రత్యేక పారిశుద్ధ్యం పనులు



పారిశుద్ధ్యం పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ వెంకటరమణ, బావాజాన్ తదితరులు

**మదనపల్లె :** మండలంలోని బసినికొండ పంచాయతీలో ప్రత్యేక పారిశుద్ధ్యం పనులు చేయిస్తున్నట్లు సర్పంచ్ వెంకటరమణ, వైస్‌సర్పంచ్ బావాజాన్ తెలిపారు. ఆదివారం బసినికొండ పంచాయతీలోని నిమ్మనపల్లె రోడ్డులో జేసీబీతో కాలువల్లో పూడికలు తీయించారు. నిలిచిన మురుగును సాఫీగా వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...వర్షాకాలం సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్న నేపథ్యంలో పంచాయతీలో పారిశుధ్యపనులు ముమ్మరం చేశామన్నారు. నిమ్మనపల్లె రోడ్డులో కాలువల్లో మురుగు నిలిచిపోయి, దోమలకు ఆవాసంగా మారిందని, దుర్వాసనతో ఉండలేకపోతున్నామని స్థానికుల ఫిర్యాదుమేరకు సమస్య పరిష్కరించినట్లు తెలిపారు. గ్రామ ప్రజలు తమవంతు బాధ్యతగా వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకుని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

## ఉచిత వైద్యశిబిరానికి స్పందన



కేవీపల్లె: వగళ్లలో సంజీవిని గ్రామీణ స్త్రీ ఆరోగ్య పరిరక్షణ వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం



గుర్రంకొండ: వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న గుండె వైద్య నిపుణులు బాలకిషోర్

**కేవీపల్లె :** మండలంలోని వగళ్లలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఆదివారం అరబిందో ఫార్మా ఫౌండేషన్ సౌజన్యంతో శ్రీనివాస చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'సంజీవిని గ్రామీణ స్త్రీ ఆరోగ్య పరిరక్షణ' ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ శశికుమార్‌రెడ్డి మాట్లాడుతూ వైద్యశిబిరంలో 95 మంది మహిళలకు పాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అలాగే సాధారణ జబ్బులకు సంబంధించి 221 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ట్రస్టీ డాక్టర్ పి.వి. బ్రహ్మారెడ్డి, ట్రస్ట్ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ సృజన, డాక్టర్ సృజన, డాక్టర్ కీర్తన, డాక్టర్ విద్య, డాక్టర్ షమీమ్, వలంటీర్లు రామాంజనేయులు, షబ్బీర్, బాషా, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

**గుర్రంకొండలో..**

**గుర్రంకొండ:** మండల కేంద్రమైన గుర్రంకొండలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఆదివారం స్థానిక తెలుగు జెడ్పీ హైస్కూల్లో మదనపల్లెకు చెందిన శ్రీ వెంకటేశ్వర మల్టీస్పెషాలిటీ హర్ట్ అండ్ డయాబెటిక్ ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంకాలం వరకు ఫిజిషియన్, గుండె, చక్కెర, వ్యాధితో బాధపడే రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 200 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆపరేషన్లు అవసరమైనవారికి తిరుపతి, అనంతపురం పట్టణాలకు సిఫార్సు చేశారు. సదరు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న వారికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తారని వైద్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో గుండె వైద్యనిపుణులు బాలకిషోర్, చక్కెరవ్యాధి వైద్యురాలు స్పందన, జనరల్ ఫిజిషియన్ ఇంతియాజ్, నక్కా గోపాలకృష్ణ, ఆశావర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్తమ సేవలతోనే ఉపాధ్యాయులకు గుర్తింపు



రమణయ్యను సన్మానిస్తున్న శ్రీనివాసరాజు, ఉపాధ్యాయులు

**రాయచోటి టౌన్:** ఉత్తమ సేవలతోనే ఉపాధ్యాయులకు సమాజంలో గుర్తింపు లభిస్తోందని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర బాధ్యులు కొండూరు శ్రీనివాసరాజు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధి గరుగుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయులు రమణయ్య పదవీ విరమణ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు నాగప్రభ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాజిక, విద్యా రంగాల్లో ఉత్తమ సేవలు అందించినప్పుడే ఉపాధ్యాయులకు సమాజంలో గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు నైతిక విలువలు, సామాజిక స్పృహ, శాస్త్రీయత గురించి వివరించాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులు, బంధుమిత్రులు రమణయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా సెక్రటరీ నరసింహారెడ్డి, గరుగుపల్లి సర్పంచ్ వాసు, ఏపీటీఎఫ్ నాయకులు హరిబాబు, విశ్రాంత ప్రిన్సిపాల్ ఓబన్న, గాలివీడు ఎంఈఓ -2 శ్రీనివాసులు పాల్గొన్నారు.

# నల్ల గంగమ్మకు పూజలు



ప్రత్యేక అలంకరణలో మల్లూరమ్మ తల్లి

**సంబేపల్లె :** మండల కేంద్రంలోని దేవరరాయి నల్ల గంగమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయాన్ని వేపాకులతో ఆలయ ప్రాంగణమంతా శుద్ధి చేశారు. అర్చకలు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చకులు, అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొన్నారు.

**చిన్నమండెం :** మండల పరిధిలోని మల్లూరు గ్రామంలో వెలసిన శ్రీ మల్లూరమ్మ తల్లికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం ఆలయ అర్చకులు పలు పూజలను నిర్వహించారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి బంధుమిత్రులతో కలిసి విందును ఆరగించారు.

పెనగలూరు: మండల కేంద్రమైన పెనగలూరు పంచాయతీలోని కొత్తపల్లిలో వినాయకస్వామి ఆలయంలో వేదపండితులతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.